ప్రతీకారంపై ఉన్న శ్రద్ధ.. పాలనపై ఏది?



పడమరవీరాయపాలెంలో ఆర్బీకే, విలేజ్ క్లినిక్



నిరుపయోగంగా ఉన్న సచివాలయం, ఆర్బీకే, విలేజ్ క్లినిక్

- నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు
- అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలు

కురిచేడు:

రాష్ట్రంలో అధికార పార్టీ నాయకులకు ప్రతీకారంపై ఉన్న శ్రద్ధ.. పాలనపై లేదు. గత ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా ఉన్నా వాటిని వినియోగంలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేయడం లేదు. ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా మారడం అటుంచి అవి అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలు మారుతున్నాయి. అధికారంలోకి వచ్చిన నాయకులు వాటిని ప్రజలకు ఎలా ఉపయోగించాలో ఆలోచించి వాటిని ఉపయోగిస్తే ఇటు ప్రజలకు, అటు ప్రభుత్వానికి ఉపయుక్తంగా ఉంటుంది. ఆకతాయిలు ఖాళీగా ఉన్న దేనినీ విడిచి పెట్టకుండా ఉపయోగించుకుంటున్నారు. ప్రభుత్వం సానుకూలంగా ఆలోచించి భవనాలను ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకుంటే ప్రజాధనం దుర్వినియోగం కాకుండా ప్రజోపయోగం అవుతుందని విషయాన్ని గుర్తించాల్సిన అవసరం ఉంది. ప్రజల అవసరాలు తీర్చేందుకు గత ప్రభుత్వం మండలంలో 11 గ్రామ సచివాలయాల పరిధిలో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు 88 కోట్ల రూపాయలతో నిర్మించారు. వాటిల్లో ఐదు సచివాలయాల పరిధిలో కొన్ని భవనాలు వినియోగంలోకి తేవాల్సి ఉంది. గ్రామ సచివాలయాలు, రైతు భరోసాలు, విలేజ్ క్లినిక్‌లు వినియోగానికి నోచుకోలేదు. మండలంలోని కురిచేడు–2, ఆవులమంద, పడమర నాయుడుపాలెం గ్రామాల్లోని గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లతో పాటు పడమరవీరాయపాలెంలోని రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్, ప్లాట్లపాడులోని రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్, కురిచేడులోని స్త్రీశక్తి భవనాలు ఇంకా ఉపయోగంలోకి రాలేదు. నిర్మాణాలు పూర్తి చేసుకుని ప్రారంభోత్సవాలు కూడా జరుపుకున్నా వాటిని ప్రభుత్వం వినియోగంలోకి తీసుకురాలేదు. దీంతో వాటి నిర్మాణానికి ఉపయోగించిన ప్రజాధనం 3.42 కోట్ల రూపాయలు వృథా అయినట్లేనని చెప్పవచ్చు. అంతేకాకుండా వాటిల్లోని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సిబ్బంది జీతాలు అన్నింటికీ ప్రజాధనంతో ముడిపడి ఉంది. ప్రజాధనంతో ప్రజల కోసం చేపట్టిన నిర్మాణాలను నిరుపయోగం కాకుండా చూడాల్సిన బాధ్యత కొత్తగా వచ్చిన ప్రభుత్వాలు చేపడితే ప్రజలు సంతోషిస్తారు.


ప్రభుత్వ భవనాల వద్ద ఆకతాయిలు తాగిపడేసిన మద్యం బాటిళ్లు


వధూవరులతో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, పక్కన వైఎస్సార్ సీపీ నాయకులు

వధూవరులకు ఎమ్మెల్యే తాటిపర్తి ఆశీర్వాదం

పెద్దదోర్నాల: మండల పరిధిలోని చిన్నదోర్నాలలో పెద్దదోర్నాల మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దర్శనం నాగయ్య కుమార్తె వివాహానికి యర్రగొండపాలెం నియోజకవర్గ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన దంపతులు యలకపాటి అల్లూరయ్య, వసంతలను ఆయన ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. వివాహ వేడుకల్లో మండల పార్టీ అధ్యక్షుడు గంటా రమణారెడ్డి, మైనారిటీ సెల్ రాష్ట్ర కన్వీనర్ షేక్ అబ్దుల్ మజీద్, సర్పంచ్ చిత్తూరి హారిక, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు యక్కంటి వెంటేశ్వరరెడ్డి, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మా యల్లేష్, నాయకులు జంకె సుబ్బారెడ్డి, ఎల్లారెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

మట్టి నమూనాలతో బహుళ ప్రయోజనాలు


వరి రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ బాలాజీనాయక్

ముండ్లమూరు: రైతులు తమ పొలాల్లో సేకరించిన మట్టి నమూనాల ఆధారంగా అధికారుల సూచనల ప్రకారం పంట సాగు చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కె.బాలాజీ నాయక్ తెలిపారు. మండలంలోని చింతలపూడిలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. పంట సాగు చేసే సమయంలో విత్తన శుద్ధి చేయడం ద్వారా తెగుళ్ల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. మట్టి నమూనాల ఆధారంగా భూమిలో అవసరమైన పోషకాలను వాడతే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. వరి సాగు చేసే రైతులు నారుమడిలోనే కొసలు తుంచి నాటడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయన్నారు. కాండం తొలుచు పురుగును నివారించుకోవచ్చన్నారు. ఆకులు ఎర్రబడడం, పాలిపోవడం జరిగితే సూక్ష్మపోషకాలు పిచికారీ చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఏఓ మహ్మద్ ఫరూక్, ఎంపీఈఓ బి.నరేంద్ర, సిబ్బంది అబ్దుల్ రజాక్, బాలవెంకటయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరపాలి

దొనకొండ: పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు గురువారం ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని మండల విద్యాధికారి ఎస్.సాంబశివరావు సూచించారు. మండలంలోని 70 పాఠశాలల్లో 4,250 మంది విద్యార్థులు ఉన్నారని, ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా ముగించుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులపై ఉందన్నారు. ఏవైనా సమస్యలుంటే వెంటనే తమకు తెలియజేయాలని ఎంఈఓ సూచించారు.

వాతావరణాన్ని పరిరక్షించేందుకు మొక్కలు నాటాలి


మొక్కలు నాటుతున్న తహసీల్దార్ శ్రావణ్‌కుమార్

దర్శి: వాతావరణ వ్యవస్థను పరిరక్షించాలంటే మొక్కలు నాటి పెంచాలని తహసీల్దార్ శ్రావణ్ కుమార్ సూచించారు. స్థానిక బాలికల పాఠశాలలో బుధవారం మొక్కలు నాటి వాటి ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఒక ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరుచుకుని ఆ లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలని సూచించారు. పాఠశాలలకు మొక్కలు అందజేసిన న్యాయవాది సురేష్‌ను అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ ఖాదర్ మస్తాన్, కేవీజీ కీర్తి, కబీర్, భారతి, లక్ష్మీరాజ్యం, పద్మావతి, అనూరాధ, శ్రీదేవి, ప్రమీల, మంజుల, నాగజ్యోతి, విజయ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

త్రిపురాంతకం తహసీల్దార్‌గా శ్రీనివాసరావు


తహసీల్దార్ శ్రీనివాసరావు

త్రిపురాంతకం: త్రిపురాంతకం తహసీల్దార్‌గా శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లా నుంచి ఆయన బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావును సిబ్బంది, వీఆర్‌ఓలు కలిసి పరిచయం చేసుకున్నారు. అనంతరం పలు శాఖలకు చెందిన ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు.

రుణాల మంజూరుకు అర్హులను గుర్తించాలి

బేస్తవారిపేట: ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ పథకంలో లోన్లకు అర్హులను గుర్తించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ వసుంధర అన్నారు. బుధవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండలానికి రెండు లక్షలు, రూ.2–5 లక్షల రుణాలు 50, ఒకటి నుంచి రెండు లక్షల లోపు రుణాలు 200 మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రతి గ్రూప్‌లో సభ్యులకు సంబంధించి లోకోస్ సర్వేను పూర్తి చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు అర్హులకు ఇవ్వాలని, స్త్రీనిధి రికవరి వంద శాతం ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పొదుపు మహిళలతో మాట్లాడారు. ఏరియా కో ఆర్డినేటర్ అంబేడ్కర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు గొంగటి అంజనాదేవి, ఏపీఎం కంచర్ల రఘునాథబాబు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

తల్లిపాలలో పోషకాలు


పెద్దారవీడు: అవగాహన ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


రుద్రసముద్రంలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

దొనకొండ: బిడ్డకు పుట్టిన వెంటనే పాలు తాగించాలని, తల్లిపాలలో పోషక విలువలు ఎక్కువ ఉంటాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి తెలిపారు. మండలంలోని రుద్రసముద్రం, బాదాపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆమె ఆధ్వర్యంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ ఆరు నెలల వరకు కేవలం బిడ్డకు తల్లి పాలు తాగించాలని, బిడ్డ పుట్టిన వెంటనే అరగంటలోపు తల్లి పాలు తాగించాలని, దీని వలన వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అదే విధంగా తల్లికి పాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. అంటువ్యాధులు అతిసార, శ్వాస కోశ సంబంధిత వ్యాధులు రావని ఆమె తెలిపారు. ఎఫర్ట్ సంస్థ అధికారి కె.భారతి మాట్లాడుతూ తల్లి పాలు ఇస్తే బిడ్డకు అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. బాలింతలు, గర్భిణులు సూచన, సలహాలందించారు. అనంతరం ర్యాలీ చేశారు. సీహెచ్‌ఓ ఇన్నాసమ్మ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పెద్దారవీడు: తల్లి పాలు బిడ్డలకు దివ్య ఔషధంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ తెలిపారు. మండలంలోని సుంకేసుల, ప్రగళ్లపాడు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు తాగిస్తే కలిగే ప్రయోజనాలు వివరించారు. ఎఫ్‌ఎల్‌ఎం జిల్లా కో ఆర్డినేటర్ ఎం.సుబ్బారావు మాట్లాడుతూ విద్యా విధానంలో నూతనంగా వచ్చిన మార్పులు పూర్వ ప్రాథమిక విద్య ఆవశ్యకతను తెలియజేశారు. కార్యకర్తలు భారతి, నాగరత్నమ్మ, స్రవంతి, కొండమ్మ, జయంతి, రాజ్యలక్ష్మి, ఆవులక్క, పద్మ, సుమలత, నాగమ్మ పాల్గొన్నారు.

దర్శి: పుట్టిన బిడ్డకు వెంటనే తల్లి ముర్రుపాలు తాగించాలని వైద్యాధికారి కాశీ చేతన్ సూచించారు. పట్టణంలోని శివరాజనగర్‌లో తల్లిపాల మాసోత్సవాలు బుధవారం జరిగాయి. దర్శి ప్రాజెక్ట్ అధికారి సీహెచ్ భారతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వైద్యాధికారి కాశీ చేతన్ ముఖ్యఅతిథిగా హాజరై తల్లి బిడ్డలకు, బాలింతలకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా కాశీ చేతన్ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు అందిస్తే బిడ్డకు వ్యాధులు సోకకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో శిక్షణ పొందిన వైద్యులు ఉంటారని, ప్రతి తల్లి కాన్పులు ప్రభుత్వ వైద్యశాలలో చేయించుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు అనూరాధ, లతా, రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పుష్పాల బాలమ్మ, పార్వతి, సంధ్య, సుజాత, లక్ష్మి, ఏఎన్‌ఎంలు, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

కురిచేడు: ప్రసవించిన గంటలోపు పాలను తప్పనిసరిగా బిడ్డకు పట్టించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజరు ఆర్.నాగమణి తెలిపారు. స్థానిక నుసుం బజారులోని అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త షేక్ ఫాతిమా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన తల్లి పాల వారోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ముర్రుపాలపై తల్లులకు ఉన్న అపోహలు ఆమె తొలగించే విధంగా వివరించారు. సీహెచ్‌ఓ టీనా మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు మొదటి టీకా అని చెప్పారు. ఏఎన్‌ఎం షేక్ ఫర్వీన్ మాట్లాడుతూ తల్లి పాల నుంచి అన్ని రకాల పోషకాలు బిడ్డకు అందుతాయన్నారు. తల్లి బిడ్డకు ఇచ్చే అంతు లేని సంపద తల్లిపాలు మాత్రమేనని అంగన్‌వాడీ కార్యకర్త షేక్ ఫాతిమా పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్. సువర్ణలత, పార్వతి, ప్రభావతి పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: మండల పరిధిలోని పలు కేంద్రాల్లో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ మాట్లాడుతూ తల్లిపాలు అందించడమే బిడ్డకు వేసే మొట్టమొదటి టీకాగా భావించాలన్నారు. పుట్టిన వెంటనే బిడ్డలకు తల్లిపాలు పట్టిస్తే బిడ్డల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపొందించుకోవచ్చని, ముర్రుపాలు తాగితే బిడ్డలు వ్యాధి నిరోధక శక్తి పెరిగి అనారోగ్యం పాలు కాకుండా బలంగా తయారవుతారని చెప్పారు. ఈ సందర్భంగా 404, 407 అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. సునీత, భాగ్యలక్ష్మి, అమల, వెంకటరత్నం, బీబీ, ముంతాజ్, మల్లేశ్వరిదేవి, రామకృష్ణానాయక్, అనూష పిస్కిల్లా, ఆశా వర్కర్లు రాణి, సుకన్య పాల్గొన్నారు.

త్రిపురాంతకం: తల్లిపాలు పిల్లలకు పౌష్టికాహారమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ హైమావతి, విశ్రాంతమ్మ పేర్కొన్నారు. మండలంలోని రాజుపాలెం, సోమేపల్లిలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లి పాల ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. శిశువు జన్మించిన వెంటనే తల్లిపాలు పట్టడం ఆరోగ్యకరమన్నారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

ముండ్లమూరు: మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి వైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తూ క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ సీహెచ్ భారతి తెలిపారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు జన్మనిచ్చిన వెంటనే ముర్రుపాలు పట్టించడం ద్వారా వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. గర్భం దాల్చిన వెంటనే అంగన్‌వాడీ కేంద్రాల్లో తమ పేరు నమోదు చేయించుకోవాలన్నారు. తద్వారా ప్రభుత్వ రాయితీలు, ప్రోత్సాహకాలు పొందొచ్చన్నారు. బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు తప్పకుండా ఇవ్వాలన్నారు. ఆరు నెలల తర్వాతనే అనుబంధ ఆహారం తినిపించాలన్నారు. వైద్యాధికారులు జాస్మిన్, వెంకటేశ్వరరెడ్డి, సూపర్‌వైజర్లు నారాయణరావు, సీహెచ్‌ఓ నారాయణరావు, ఐసీడీఎస్ సిబ్బంది సునీత, మహిళా శిశు సంరక్షణ కార్యదర్శి శాంతిప్రియ పాల్గొన్నారు.



కురిచేడు: తల్లిపాల గురించి వివరిస్తున్న అధికారులు


దర్శి: గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్‌వాడీలు

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి


వరి పొలాలు పరిశీలిస్తున్న ఏఓ ప్రసాదరావు

తాళ్లూరు (దర్శి): వరిలో ఎలుకల నియంత్రణకు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏఓ ప్రసాదరావు సూచించారు. క్షేత్ర పర్యటనలో భాగంగా వరి పొలాలను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ ఎలుకల ఉనికిపై పంటకాలం అంతా నిఘా ఉంచాలన్నారు. గట్ల సంఖ్య, పరిమాణాన్ని వీలైనంత వరకు తగ్గించడం ద్వారా వాటి నివాస స్థావరాలను తగ్గించవచ్చని చెప్పారు. గట్లపై గడ్డి, కలుపు లేకుండా శుభ్రపరుచుకోవాలని, గట్లను పదునైన పారతో చెక్కుకోవాలని సూచించారు. ఎలుకల బుట్టలను ఎకరాకు 20 చొప్పున పెడితే నియంత్రించవచ్చని తెలిపారు. పంట కాలంలో విషపు ఎరలను చిరుపొట్టదశ ఏర్పడక ముందే ఉపయోగించాలని సూచించారు. బ్రోమోడయోలిన్ ఎరను 10–15 గ్రాములు 96 పాళ్ల నూకలు, రెండు పాళ్ల నూనె, రెండు పాళ్ల మందు పొట్లాలు కట్టి కన్నంలో ఒకటి చొప్పున పెట్టాలని సూచించారు. ఎలుకలు బతికి ఉన్న కన్నంలో 10 రోజుల వ్యవధితో పైరు చిరుపొట్టకు వచ్చే వరకు లేదా రెండు మూడు సార్లు వాడాలని తెలిపారు. ప్రస్తుతం వరి నారు, నాట్లు వేయటం, 30 రోజులు పైరు, చిరు పొట్ట వివిధ దశల్లో ఉన్నాయి కనుక రైతులు నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. వీఏఏ నాగరాజునాయక్, ఏఈఓ నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులపై ప్రజావేదిక


ప్రజావేదిక నిర్వహిస్తున్న డ్వామా పీడీ అర్జునరావు

బేస్తవారిపేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి నెల వరకు జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఉపాధి హామీ పనులకు రూ.11 కోట్లు, పంచాయతీరాజ్ పనులకు రూ.6 కోట్ల పనులకు సంబంధించి పంచాయతీల్లో సోషల్ ఆడిట్ నిర్వహించారు. దీనిపై ప్రజావేదికను డ్వామా పీడీ అర్జునరావు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీల్లో పనిచేస్తున్న ఫీల్డ్‌అసిస్టెంట్‌లను తొలగించేందుకు గ్రామాల్లోని టీడీపీ నాయకులు ఉపాధి హామీ పనులకు వచ్చిన వారిని రాలేదని, పాఠశాలల్లో స్వీపర్‌గా పని చేస్తూ వేసవి సెలవుల్లో ఉపాధి పనులు పనిచేసిన తప్పు అన్నట్లుగా ప్రజావేదికలో ఆరోపణలు చేశారు. దీనిపై ఎంపీపీ, జెడ్పీటీసీలు గట్టిగా స్పందించడంతో రికవరీ లేకుండా వీఆర్వో విచారణకు ఆదేశాలిచ్చారు. జిల్లా విజిలెన్స్ అధికారి ఝాన్సీ, డ్వామా ఏపీడీ భాస్కరరావు, ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, ఎస్ఆర్‌పీ నందిని, ఎంపీడీఓ టి.పార్వతి, ఏపీఓ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ ప్రతిష్ఠ ఉత్సవాలు


కలశ పూజల్లో పాల్గొన్న ఉభయదాతలు

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పోలేరమ్మతల్లి, పోతురాజుస్వామి నూతన ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితుడు కారంచేటి దక్షిణామూర్తి ఆధ్వర్యంలో కలశ స్థాపన పూజల్లో ఉభయదాతలు కంకణాలు ధరించి హోమాలు, అభిషేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

ఎస్‌ఎంసీ ఎన్నికల్లో రాజకీయాలొద్దు


హెచ్‌ఎంల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై మాధవరావు

కొనకనమిట్ల: ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి గురువారం నిర్వహిస్తున్న మేనేజింగ్ కమిటీ ఎన్నికలను రాజకీయాలకు అతీతంగా ప్రశాంతంగా నిర్వహించేందుకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని ఎస్ఐ మాధవరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓలు ఎస్‌కే డాంగేషరీఫ్, బరిగె నరసింహారావుతో కలిసి నిర్వహించిన హెచ్‌ఎంల మావేశంలో ఎస్సై మాట్లాడారు. కమిటీ ఎన్నికకు ముందుగా తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలని హెచ్‌ఎంలకు సూచించారు. ఏకాభిప్రాయంతో ఎన్నిక కుదరని పక్షంలో రహస్య ఓటింగ్ నిర్వహించాలని చెప్పారు. ఏదైన సమస్య వస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. కమిటీ ఎన్నికకు రాజకీయ నాయకులను అనుమతించవద్దని స్పష్టం చేశారు. ఎంఈఓ–1 ఎస్‌కె డాంగేషరీఫ్ మాట్లాడుతూ.. అన్ని పాఠశాలల్లో మేనేజింగ్ కమిటీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు చేశామన్నారు. హెచ్‌ఎంల ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామన్నారు.

భరతనాట్యంలో బొద్దికూరపాడు విద్యార్థుల ప్రతిభ

తాళ్లూరు (దర్శి): తాళ్లూరు మండలం బొద్దికూరపాడు, పాదిలి గ్రామాలకు చెందిన విద్యార్థులు భరతనాట్యం పోటీల్లో సత్తా చాటారు. బొద్దికూరపాడుకు చెందిన మామిడి శివశంకర్ మాస్టారు ఆధ్వర్యంలో హైదరాబాద్ ముచ్చింతలలోని చినజియ్యర్ స్వామి ఆశ్రమంలో భరతనాట్యం పోటీల్లో బుధవారం పాల్గొని తమ సత్తా చాటారు. చినజియ్యర్ స్వామి చిన్నారులను అభినందించి జ్ఞాపికలు, ప్రశంస పత్రాలు అందించి అభినందించారు. పోటీల్లో సంతోష్, పుష్ప వర్షిత్, తన్మయ శ్రీ, పల్లవి, వాత్సల్య, వర్షిణి పాల్గొన్నారు. నృత్యప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులను బొద్దికూరపాడు గ్రామస్తులు అభినందించారు.


చిన్నారులను అభినందిస్తున్న చినజియ్యర్ స్వామి